జగనన్న ఆరోగ్య సురక్షతో మేలు

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా

తాడికొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో లబ్ధి పొందని కుటుంబం ఏదైనా ఉందని చూపగలరా అని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా పేర్కొన్నారు. బుధవారం తాడికొండ సచివాలయం- 3 పరిధిలోని ఎస్‌వీవీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి ఇంటి వద్దకే వైద్యులను పంపించి అన్ని రకాల పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు అందజేస్తున్నారని చెప్పారు. విద్య, వైద్య రంగాలను కార్పొరేట్ వ్యవస్థ పట్టి పీడిస్తున్న నేపథ్యంలో ప్రతి పేదవాడికి ఆయా రంగాలను చేరువ చేసేందుకు ఆయన చేస్తున్న కృషి దేశంలోనే పేరు ప్రఖ్యాతలు సాధించిందనడంలో సందేహం లేదన్నారు. కులం, మతం, ప్రాంతం, పార్టీ భేదం లేకుండా అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మళ్లీ సీఎంగా గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచి తోకల సరోజినీ, వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి, మండల ప్రత్యేకాధికారి, పరిశ్రమల శాఖ డీడీ సుధాకర్, ఎంపీడీఓ అత్తోట దీప్తి, డెప్యూటీ తహసీల్దార్ కాకుమాను ప్రసాద్, కార్యదర్శి పిట్టు శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలి

బోరుపాలెం(తాడికొండ): జగనన్న ఆరోగ్య సురక్షా కుటుంబాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకునేలా అధికారులు, సచివాలయ ఉద్యోగులు సమష్టిగా పనిచేయాలని గుంటూరు ఆర్డీఓ ప్రభాకర్ రెడ్డి సూచించారు. బుధవారం తుళ్లూరు మండలం బోరుపాలెంలో చేపట్టిన జగనన్న సురక్ష ఆరోగ్య శిబిరాన్ని పరిశీలించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. వైద్య శిబిరంలో ప్రాథమిక వైద్యంతో పాటు కంటి, గుండె సంబంధిత రోగాలకు కూడా పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, దీని ద్వారా రోగాలను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి సమస్య చిన్నదిగా ఉన్నప్పుడే పరిష్కారం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.కల్యాణి, ఎంపీడీఓ బి.శివన్నారాయణ, ఈఓపీఆర్డీ నాగానంద్, ఎంఈఓ కోటేశ్వరరావు పాల్గొన్నారు.


జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు మందులతో కూడిన ఫైల్ అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా

కొర్రపాడులో..

మేడికొండూరు: మండల పరిధిలోని కొర్రపాడులో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పలువురు వైద్యులు, స్పెషలిస్టులు పాల్గొని రోగులకు పలురకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 358 మంది వైద్య శిబిరంలో వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్, గ్రామ సర్పంచి బొడ్డు నాగమల్లేశ్వరరావు, తహసీల్దార్ శ్రీనివాస శర్మ, ఎంపీడీఓ ప్రభాకరరావు, మండల వైద్య అధికారి అనురాధ్, గ్రామ పార్టీ నాయకులు నరసింహారావు, లూర్దురాజు పాల్గొన్నారు.


బోరుపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలించి సూచనలు చేస్తున్న ఆర్డీఓ ప్రభాకర్

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఎంటీఎంసీ కమిషనర్ శారదాదేవి

తాడేపల్లిరూరల్: మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబం ఎంతో బాగుంటుందని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శారదాదేవి అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని నెహ్రూ బొమ్మ సెంటర్‌లో ఆహా క్యాంటీన్‌ను బుధవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు జీరో వడ్డీతో పాటు వివిధ రకాల రుణాలు అందజేస్తోందని చెప్పారు. ఇప్పుడు సరి కొత్తగా ప్రజలకు అతి తక్కువ ధరలో పౌష్టిహాహారాన్ని అందించేందుకు డ్వాక్రా మహిళలను ప్రోత్సహిస్తూ ఆహా క్యాంటీన్‌ను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లిలో డోలాస్‌నగర్ చంద్రిక గ్రూప్‌నకు చెందిన సభ్యులు మాగంటి సౌజన్య, కె.వరకుమారి ఈ క్యాంటీన్‌ను మొట్టమొదటగా ప్రారంభించారని, ఈ క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం స్థలం కేటాయించడంతో పాటు అవసరమైన టెంట్‌ను ఏర్పాటు చేసుకోవడానికి రూ.13 వేల ఆర్థిక సహాయాన్ని అందించి నెలకు రూ.500 చెల్లించే విధంగా రుణ అందజేస్తోందని చెప్పారు. ఈ ఆహా క్యాంటీన్ వల్ల డ్వాక్రా మహిళలు స్వయంగా పోషక విలువలతో కలిగిన ఆహార పదార్థాలను తయారు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తారని, ఆహార పదార్థాల ధర కూడా తక్కువగా ఉంటుందని వివరించారు. మెప్మా వారు డ్వాక్రా మహిళలకు అందిస్తున్న ఈ అవకాశాన్ని డ్వాక్రా మహిళలు వినియోగించుకోవాలని, ముఖ్యంగా ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలైన ఆసుపత్రులు, రైల్వే స్టేషన్, బస్టాండ్‌ల వద్ద ఈ క్యాంటీన్ ఏర్పాటు చేసుకోవడానికి స్థలం కేటాయిస్తారని, ప్రభుత్వం అందించే ఈ టెంట్లను ఎక్కడికి కావాలంటే అక్కడకు తీసుకువెళ్లవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ పావని, ఆర్‌ఓ మురళి పాల్గొన్నారు.


ఆహా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎంటీఎంసీ కమిషనర్ శారదాదేవి

'పది'లో మెరుగైన ఫలితాలే లక్ష్యం : డీఈవో

తెనాలి టౌన్: పది తరగతి పబ్లిక్ పరీక్షల్లో గత ఏడాది కన్నా మెరుగైన ఫలితాల కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి శైలజ తెలిపారు. రూరల్ మండలం కొలకలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆమె సందర్శించారు. విద్యార్థులు తరగతి గదులు, పరిసరాలు, అక్షయపాత్ర ద్వారా వచ్చిన మధ్యాహ్న భోజనం, వాటర్ ప్లాంట్లను పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. సిలబస్ ఎంతవరకు పూర్తి అయ్యింది ? అని అడిగి తెలుసుకున్నారు. రాబోయే పరీక్షలకు సిద్ధపడాలని తెలిపారు. గత ఏడాది 10వ తరగతిలో వచ్చిన ఫలితాల గురించి ఉపాధ్యాయుల్ని అడిగారు. ఇప్పటి వరకు పూర్తి అయిన సిలబస్‌లో విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. 9వ తరగతి విద్యార్థుల ట్యాబ్‌లను పరిశీలించారు. ఎస్.ఏ-2 సాంఘిక శాస్త్రం పరీక్ష పత్రాన్ని తనిఖీ చేశారు. 7వ తరగతిలో సాంఘిక శాస్త్రం నోట్‌బుక్స్‌ను పరిశీలించి ఉపాధ్యాయుడు అన్నారావును డీఈవో అభినందించారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాల్ని అందజేశారు. ప్రథమ స్థానాలు సాధించిన విద్యార్థులతో ఫోటోలు దిగారు. కార్యక్రమంలో ఎంఈవో జయంత్‌బాబు, హెచ్ఎం మాచర్ల నాగేశ్వరరావు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పినపాటి అనిల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రసంసా పత్రాన్ని అందజేస్తున్న డీఈవో శైలజ

క్లుప్తంగా

కోదండ రామాలయంలో చండీహోమం



ఫిరంగిపురం: మండలంలోని రేపూడి కోదండరామాలయంలో బుధవారం చండీహోమం నిర్వహించారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో హోమాన్ని నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో గణపతిపూజ, మండపారాధన, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం లక్ష్మీగణపతి, రుద్ర, హనుమ, చండీహోమాన్ని రుత్వికులు శంకర శాస్త్రి, శ్యామాశాస్త్రి నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గణాధిపతికి విశేషపూజలు

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలోని జలపాలేశ్వరస్వామి ఆలయం సమీపంలోని గణాధిపతికి బుధవారం అర్చకులు ఉమాపతిశాస్త్రి విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి అష్టోత్తర, సహస్ర నామ పూజలు చేశారు. భక్తుల గోత్రాలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

నిర్మల ఫార్మసీ కళాశాలకు ప్రభుత్వ ప్రశంసలు



మంగళగిరి: నగర పాలక సంస్థ పరిధిలోని ఆత్మకూరు నిర్మల ఫార్మసీ కళాశాలకు ప్రభుత్వ ప్రశంసలు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ రహమాన్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్‌తో పాటు ఫార్మసీ విభాగంలో ఆల్ ఇండియా ఎన్ఐఆర్ఎఫ్ 83వ ర్యాంకు ఉత్తమ ప్రతిభ కనబరచినందుకు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ కె.రామ్మోహన్‌రావు చేతుల మీదుగా జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను కళాశాల ప్రెసిడెంట్ సిస్టర్ డాక్టర్ యు శౌరీ అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ నిర్మలజ్యోతి, ప్రొఫెసర్లు అభినందించారు.

దొంగల దాడిలో గాయపడ్డిన వృద్ధురాలికి డీఎస్పీ పరామర్శ



మేడికొండూరు: మండల పరిధిలోని భీమినేనివారిగ్రామంలో మంగళవారం చోరీకి వచ్చిన దొంగల దాడిలో గాయపడిన వృద్ధురాలిని తుళ్లూరు డీఎస్పీ పోతురాజు బుధవారం పరామర్శించారు. చోరీ జరిగిన తీరును వృద్ధురాలిని అడిగి ఆయన తెలుసుకున్నారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు సేకరించి కేసును త్వరితగతిన ఛేదిస్తామని తెలిపారు. గ్రామాల్లో ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు వెంటనే 100 నంబరుకు సమాచారాన్ని అందించాలని ఆయన సూచించారు. ఆయన వెంట మేడికొండూరు సీఐ వాసు ఉన్నారు.

దివ్యాంగుడికి క్రికెటర్ అంబటి రాయుడు చేయూత



మేడికొండూరు: దివ్యాంగుడికి క్రికెటర్ అంబటి రాయుడు చేయూత అందించారు. మేడికొండూరు గ్రామానికి చెందిని దివ్యాంగుడు తూమాటి డేవిడ్, మూడు చక్రాల వాహనాన్ని అందిచాలని పర్యటనకు వచ్చిన అంబటి రాయుడికి విన్నవించారు. స్పందించిన ఆయన సొంత నిధులతో మూడు చక్రాల వాహనాన్ని అందించాడు. బుధవారం తన అనుచరులతో మూడు చక్రాల వాహనాన్ని డేవిడ్‌కు అందజేశారు. కార్య క్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్దయ్య, ఎంపీపీ మన్నవ స్వప్న, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బాజీ, సొసైటీ చైర్మన్ జయరావు, గాలీబ్, ఉడతా ప్రభాకర్, రాజేంద్రప్రసాద్, సుబ్బారెడ్డి, శ్రీహరి పాల్గొన్నారు.

త్రైక్వాండోలో విద్యార్థినుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాస్థాయి త్రైక్వాండో పోటీల్లో శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ స్కూల్ విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యుడు వరప్రసాదరావు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎం వర్సిటీ ప్రొఫెసర్లకు అరుదైన గుర్తింపు

మంగళగిరి: గుంటూరు జిల్లా నీరుకొండ గ్రామంలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి చెందిన ఐదుగురు ప్రొఫెసర్లుకు అరుదైన గుర్తింపు లభించింది. ప్రపంచ వ్యాప్తంగా పై వరసలో ఉన్న రెండు శాతం ఉత్తమ శాస్త్రవేత్తలుగా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్లు కార్తీక్ రాజేంద్రన్, రంగభాష్యం సెల్లసెంబియన్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్లు రణధీర్‌కుమార్, క్షీరసాగర్ సాహు, దివ్యా చతుర్వేది టాప్ టూ ర్యాంకింగ్ జాబితాలో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ఇటీవల జరిపిన శాస్త్రవేత్త డేటా విశ్లేషణ ప్రక్రియ ద్వారా రెండు శాతం ఉత్తమ శాస్త్రవేతల ర్యాంకులను ప్రకటించినట్లు తెలిపారు. ప్రొఫెసర్లు ఎనర్జీ, నెట్ వర్కింగ్ అండ్ టెలికమ్యూనికేషన్స్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ ఇమేజ్ ప్రాసెసింగ్, ఎన్విరాన్‌మెంట్ సైన్సెస్ విభాగాలలో అత్యుత్తమ పనితీరును కనబరచిన ఐదుగురు శాస్త్రవేత్తలను యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ పి.సత్యనారాయణతో పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.



గుర్తింపు పొందిన ప్రొఫెసర్లు

బాలికల హక్కులను కాపాడాలి

పెదకాకాని: బాలికల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చైల్డ్ ప్రొటెక్షన్ ఇన్‌చార్జి సిస్టర్ లత అన్నారు. పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో మంగళగిరి గుడ్ షెఫర్డ్ సిస్టర్స్ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి మాట్లాడుతూ బాలికలు ఉన్న హక్కులను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. బాలికల అభివృద్ధి కేవలం విద్యతోనే సాధ్యపడుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని సమాజంలో ఉన్నత వ్యక్తులుగా రాణించాలన్నారు. బాలికలు బాగా చదువుకుని అన్ని రంగాలలో ముందుండాలన్నారు. సీనియర్ అడ్వకేట్ కాళిదాసు, సీడీపీఓ వి.రమణ, సిస్టర్ ఊర్మిళ, సంస్థ కో ఆర్డినేటర్లు, పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు.


పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న సిస్టర్ లత

రాష్ట్ర వాలీబాల్ జట్టుకు వేజండ్ల జడ్పీ విద్యార్థినులు

వేజండ్ల(చేబ్రోలు): చేబ్రోలు మండలం వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇరువురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి వాలీబాల్ జట్టుకు ఎంపికైనట్లు పీఈటీ టి.వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. ఈ నెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు కడప జిల్లా మైదకూరులో జరిగిన అండర్-17 బాలబాలికల రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా బాలికల జట్టులో పాల్గొన్నారు. వేజండ్ల హైస్కూల్‌లో చదువుతున్న షేక్ సోనీ, మట్టుపల్లి సుమశ్రీలు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గుంటూరు జట్టు ద్వితీయ స్థానం సాధించటానికి కృషి చేశారు. వీరు జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. నవంబర్ నెలలో చెన్నైలో జరిగే జాతీయ స్థాయి అండర్-17 వాలీబాల్ స్కూల్ గేమ్స్‌లో రాష్ట్ర జట్టులో పాల్గొంటారు. శిక్షణ ఇచ్చిన పీఈటీ వెంకటేశ్వరరావును, ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను హెచ్ఎం విజయశ్రీ, ఉపాధ్యాయులు, స్థానిక గ్రామ పెద్దలు అభినందించారు.


రాష్ట్ర స్థాయి వాలీబాల్ బాలికల జట్టుకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం విజయశ్రీ, పీఈటీ

స్టాంపులు, నాణేల సేకరణను అభిరుచిగా మలచుకోవాలి

తపాలా శాఖ సూపరింటెండెంట్ యలమందయ్య

గుంటూరు ఎడ్యుకేషన్: స్టాంపులు, నాణేల సేకరణను విద్యార్థులు అభిరుచిగా మలచుకోవాలని తపాలా శాఖ సూపరింటెండెంట్ యు.యలమందయ్య సూచించారు. జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్లో బుధవారం జాతీయ తపాలా దినోత్సవం సందర్భంగా స్టాంపులు, నాణేల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా పాల్గొన్న యలమందయ్య మాట్లాడుతూ స్టాంపుల సేకరణ అనేది కింగ్ ఆఫ్ హాబిట్ వంటిదని తెలిపారు. స్టాంపుల సేకరణతో విద్యార్థుల్లో విజ్ఞానం అభివృద్ధి చెందడంతో పాటు చరిత్ర, భౌగోళిక విషయాలు, వివిధ దేశాల గొప్పదనం తెలుస్తాయని తెలిపారు. ఏపీ ఫిలాటిటిక్ సొసైటీ కార్యదర్శి ఎం. ప్రసాద్ మాట్లాడుతూ తపాలాశాఖ ప్రజలకు అందిస్తున్న సేవల్ని విద్యార్థులు తెలుసుకోవాలని సూచించారు. స్టాంపులు సేకరణ అనేది ఒక సృజనాత్మక కళ అని వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ స్టాంపుల సేకరణ విద్యార్థుల్ని కొత్త ప్రపంచంలోకి తీసుకువెళుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రదర్శనను విద్యార్థులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వై. రథినీచౌదరి, ఏవో కె. వెంకట్రావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ప్రదర్శన తిలకిస్తున్న యలమందయ్య, కృష్ణప్రసాద్, రథినీచౌదరి

విద్యార్థుల పోటీలకు స్పందన

నెహ్రూనగర్: అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని వెంగళరావునగర్‌లోని గుంటూరు నగరపాలక సంస్థ బాలికల ఉన్నత పాఠశాలలో సహృదయ సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు తమ హక్కులను గురించి తెలుసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని సూచించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి సంస్థ డైరెక్టర్ సుద్దపల్లి రవీంద్ర సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతి, సరస్వతి, సునీత, నిర్మల, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్కే సాయం

తాడేపల్లిరూరల్: మృతురాలి కుటుంబానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ప్రకటించిన ఆర్థిక సాయాన్ని పార్టీ నాయకులు వి.రజనీకాంత్, డి.వెంకటేశ్వరరావు బుధవారం అందజేశారు. దుగ్గిరాల మండలంలోని ఈమని గ్రామానికి చెందిన కోసూరి బసవపున్నమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబానికి సాయం అందించారు. కార్యక్రమంలో ఈమని సొసైటీ అధ్యక్షులు నలుకుర్తి యేసుపాదం, మత్తె ఆనంద్, పిల్లి రాఘవులు, తులాబంధుల శ్రీనివాసరావు, కత్తిక శ్రీను, జమ్ముల లోకేష్, ఉయ్యూరు మారుతి, వెంకటేశ్వరరావు, శివయ్య, శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లి రూరల్: విద్యుత్ లైన్ల మార్పిడి దృష్ట్యా గురువారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ అక్కుల సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు. కుంచనపల్లి గ్రామ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఈమనిలో చేతుల పరిశుభ్రత దినోత్సవం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(బాలుర)లో బుధవారం అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఈఈ త్రినాథ్, డీఈ రమేష్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనం ఆహారం తీసుకునే ముందు తప్పని సరిగా చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. చేతులను శుభ్రపరచుకోకపోతే క్రిములు మన ఆహారంతో పాటు లోపలికి వెళ్లి అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ వీరయ్య, ఎంఈఓ శ్రీనివాస్, ఈఓపీఆర్డీ పి.శ్రీనివాస్, జేఈ నిర్మల, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.బాలసుందరరావు, జిల్లా కో ఆర్డినేటర్ షఫి, మండల కో ఆర్డినేటర్ రాజేష్ బాబు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

పట్నంబజారు: ఇంట్లో చోరీపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జియావుద్దీన్‌నగర్‌లో నివసించే రాయ స్వాతి కుటుంబ సభ్యులు ఈనెల 10న రాత్రి తలుపు తీసి ఇంట్లో నిద్రించారు. గుర్తు తెలియని వ్యక్తులు లోపలకు ప్రవేశించి 16 గ్రాముల బంగారం, రూ. 20వేలు చోరీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కేవైసీ అప్‌డేట్ పేరిట మోసం

కేవైసీ అప్‌డేట్ పేరిట బురిడీ కొట్టించి ఖాతా నుంచి అక్రమంగా నగదు డ్రా చేసిన ఘటనపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. సంపత్‌నగర్‌కు చెందిన షేక్ ఆలిహుస్సేన్‌కు యాక్సెస్ బ్యాంకులో రెండు అకౌంట్లు ఉన్నాయి. ఈనెల 5న గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి తాను బ్యాంకు మేనేజర్‌నని, కేవైసీకి సంబంధించి అప్‌డేట్ చేయాలని నమ్మబలికే ప్రయత్నం చేశాడు. దీంతో అలి హుస్సేన్ తాను బ్యాంకుకు వచ్చి అప్‌డేట్ చేయించుకుంటానని చెప్పిన క్రమంలో ఫోన్ పెట్టేసిన తరువాత కొద్దిసేపటి తరువాత అదే వ్యక్తి ఫోన్ చేసి అకౌంట్ హ్యాక్‌కు గురైందంటూ నమ్మబలికాడు. ఓటీపీ చెప్పకపోతే నగదు పోతుందని భయపెట్టాడు. దీంతో సెల్ ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పగా, అంకౌంట్‌లోని రూ. 3 లక్షలు నగదు విత్‌డ్రా అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

గుంటూరు ఈస్ట్: చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందిన సంఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. సాయిబాబానగర్‌లోని ఓ వృద్ధాశ్రమంలో ఉండే బి.శ్రీనివాస్ (62) మంగళవారం కళ్లు తిరిగి కిందపడడంతో తలకు తీవ్ర గాయమైంది. నిర్వాహకులు జీజీహెచ్‌కు తరలించారు. శ్రీనివాస్ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సబ్‌ప్లాన్ నిధులతో అభివృద్ధి పనులు

నెహ్రూనగర్ : ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ ద్వారా దళితులు, ఆదివాసీల అభ్యున్నతికి ప్రత్యేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు రూపొందించాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రాష్ట్ర కార్యదర్శి అల్లడి దేవకుమార్ తెలిపారు. అణగారిన వర్గాల హక్కుల పునాదిగా దళిత ఆదివాసీ మేనిఫెస్టో- 2024ను రూపొందిస్తున్నట్లు చెప్పారు. అంబేద్కర్ భవన్‌లో బుధవారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో దళిత, ఆదివాసీ మేనిఫెస్టోపై గుంటూరు జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు.

ఇజ్రాయిల్ కోసం ప్రత్యేక ప్రార్థనలు

మంగళగిరి: ఇజ్రాయిల్, పాలస్తీనాల మధ్య ఏర్పడిన యుద్ధ వాతావరణం వెంటనే సమసిపోయి శాంతి ఏర్పడాలని మెట్రో రీజయన్ ఫెల్లోషిప్ ఆర్గనైజింగ్ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని పార్కు రోడ్డులోని ఇమ్మానుయేలు చర్చిలో జరిగిన ప్రార్థనలలో పాస్టర్లు బి.రవిప్రకాష్, పిల్లి దయారత్నకుమార్, దున్నా నాగయ్య, బేతాళ సాల్మాన్ రాజు, నందూరి బాలస్వామి పాల్గొన్నారు.

నోటీసు

ఒంగోలు ప్రిన్సిపల్ జిల్లా జడ్జీ వారి కోర్టులో

DOP 54/2022

పులిపాటి పూర్ణచంద్రరావు ... పిటీషనరు

Vs

పులిపాటి వీరమ్మ @ జ్యోత్స్న ... రెస్పాండెంటు

To. పులిపాటి వీరమ్మ @ జ్యోత్స్న,
W/o పూర్ణచంద్రరావు, క్రిస్టియన్, మాలపల్లె అంబేద్కర్ విగ్రహం రోడ్, నియర్ MPP ఎలిమెంటరీ స్కూల్, నిడిముక్కల గ్రామం, తాడికొండ మండలం, గుంటూరు జిల్లా.

పై తెలిపిన పిటీషనరు పై తెలిపిన కోర్టువారి ఎదుట, పై తెలిపిన నంబరు కేసు నందు మీనుండి సెక్షన్ 10 (1) (IX) & (X) ఇండియన్ డైవోర్స్ యాక్ట్ ప్రకారం, డిజర్షన్, క్రూయల్టీ కారణములుగా విడాకులు కోరుచూ పిటీషన్ను దాఖలు చేసుకొని యున్నారు. ఇందువిషయమై మీకు ఎలాంటి అభ్యంతరములున్ననూ పై తెలిపిన కోర్టువారి ఎదుట తేది. 6.11.2023న ఉదయం 10.30గంటలకు మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరు పడి మనవి చేసుకొనవలసినదిగా తెలియపరచడమైనది. లేని యెడల మీ పరోక్షమందు ఈ కేసును తీర్మానించెదరు అని తెలుసుకోవలెను.

కోర్టువారి ఉత్తర్వులతో..

గల్లా గాంధీ, పిటీషనరు తరుపు అడ్వకేట్, ఒంగోలు. సెల్ : 99487 36955

పొలంబడితో రైతులకు పలు ప్రయోజనాలు



తెనాలి టౌన్: పొలంబడితో రైతులకు పలు ప్రయోజనాలున్నాయని మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ తెలిపారు. రూరల్ మండలం మల్లెపాడులో బుధవారం వ్యవసాయాధికారులు పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడి సాధించడానికి పొలంబడి ఉపయోగపడుతుందని తెలిపారు. పైరు శత్రు, మిత్ర పురుగుల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. పొలంబడి వల్ల కలిగే ప్రయోజనాల్ని తెలియజేశారు. కార్యక్రమంలో వీఏఏ లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

తెనాలి రూరల్: పట్టణంలోని పాండురంగపేట మహాప్రస్థానం ఎదురుగా ఉన్న పూరిల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. బుధవారం సాయంత్రం మహాప్రస్థానానికి మృతదేహాన్ని తీసుకు వస్తున్న వారు టపాసులు పేల్చడంతో నిప్పురవ్వలు ఇంటి మీద పడి పైకప్పు దగ్ధమైంది. ప్రమాదంలో గృహ సామగ్రి కాలిపోయిందని బాధితుడు షేక్ సుభాని వాపోయారు. ప్రమాద విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటల్ని అదుపు చేశారు. రూ. 70 వేల నష్టం ఉంటుందని భావిస్తున్నారు.

విశ్రాంత ఉపాధ్యాయురాలు సునందమ్మ మృతి



తెనాలి టౌన్: మండలంలోని కొలకలూరులో విశ్రాంత ఉపాధ్యాయురాలు కోడూరు సునందమ్మ(నాగమ్మ) (86) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. మనుమరాలు చొప్పర ప్రీతి కొలకలూరు సర్పంచిగా పని చేస్తున్నారు. కుమారుడు కోడూరు సుదర్శన్‌బాబు విజయవాడలో ట్రాన్స్‌కోలో డీఈఈగా పని చేస్తున్నారు. సునందమ్మ భౌతికకాయాన్ని పలువురు ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు, న్యాయవాదులు, ఉద్యోగులు సందర్శించి నివాళులర్పించారు.